

# కథా కౌముది

## దేవుడు పుట్టిన రోజు పి.రాజేంద్ర ప్రసాద్

మధ్యాహ్నం ఒంటిగంట కావస్తూంది. ఆ పెద్ద బిల్డింగులోని హాలులో అందరూ వరుసగా కూర్చుని ఉన్నారు. మధ్యాహ్నభోజనం వడ్డన జరుగుతోంది. వాళ్ళందరూ రోజూ అలాగే అక్కడే భోజనం చేసే అలవాటైనా ఈ రోజుకొక ప్రత్యేకత ఉంది. అది ఈ రోజు మా శ్రీలక్ష్మి పుట్టినరోజు. తను కూడా కొన్ని కొన్ని పదార్థాలు వడ్డిస్తూ అందరికీ అన్నీ అందుతున్నాయా లేదా అని చూసుకుంటూ అటూ ఇటూ గలగలా తిరుగుతోంది. తన పేరుకు తగ్గట్టుగా ఉన్న ఖరీదైన పట్టులంగా ఓణీలో మెరిసిపోతూ పదహారో పుట్టిన రోజు జరుపుకుంటోంది. ఆమె కళ్ళల్లో, ముఖంలో అంతులేని సంతోషం. అందరినీ "అక్కా! మైసూర్ పాక్ వేసుకో, తమ్ముడూ నీకు గులాబ్ జామ్ వెయ్యనా..అన్నయ్యా పులిహోర వడ్డించనా... అంటూ హడావుడి చేస్తోంది. నేనూ, మా శ్రీమతీ, మా పెద్దమ్మాయి దీప్తీ, అల్లుడుగారు అనిరుధ్ అందరూ వడ్డిస్తున్నాం. మాకు తోడు కేటరింగ్ కుర్రాళ్ళు కూడా అందరికీ వడ్డన చేస్తున్నారు. తింటున్న వాళ్ళు అందరూ అయిదేళ్ల వయసు వాళ్లనుండి పదిహేడు, పద్దెనిమిదేళ్ల వాళ్ళ వరకూ ఉన్నారు.

భోజనాలు పూర్తయ్యాక అందరం కలిసి అక్కడే ఆ శరణాలయంలోనే బర్త్ డే కేక్ ను కోసి అందరికీ పంచాం. దానితో పాటు వాళ్ళందరికీ చిన్న చిన్న గిఫ్టులు కూడా పంచేసరికి టైమ్ దాదాపుగా మూడయ్యింది. వాళ్ళందరి దగ్గరా సెలవు తీసుకుని ఇంటికి చేరాం. కొద్దిసేపు విశ్రాంతి తీసుకుని సాయంత్రం ఫ్రెష్ అయ్యాక అమ్మాయినడిగాను. "ఏమ్మా! శ్రీలక్ష్మీ.. ఎక్కడికెళదాం?" అంటూ. అప్పటికే తను పట్టు లంగా, ఓణీ మార్చేసి తనకోసం మేం కొన్న వేరే కొత్త పంజాబీ డ్రెస్ లోకి మారిపోయింది.

తన ముఖంలో ఎన్నడూ లేనంత ఆనందం కనిపిస్తుండగా "డాడీ! బీచ్ కి వెళదామా?" అడిగింది.

"నువ్వెక్కడికంటే అక్కడికే డియర్. బీచ్ నుంచి అలాగ ఏదైనా రెస్టారెంట్ కి వెళ్లి అక్కడే తినేసి వద్దాం." ప్రతిపాదించాను నేను. అందరూ "హాయ్! హాయ్! బలే.. బలే.." అన్నారు ఒక్కసారిగా..ఒక్క శ్రీలక్ష్మి తప్ప.

"తొందరగా ఇంటికొచ్చేసి ఏముంటే అది అందరం కలిసి తినేద్దాం డాడీ... పెద్దగా ఏమీ వంట ఎందుకు? టిఫినైనా ఫర్వాలేదు.." అంది తను.

"భలేదానివేలే చిన్నీ! నీ పుట్టిన రోజు కదా అని మీరంతా మధ్యాహ్నం రెస్టు తీసుకుంటున్నప్పుడు ఆల్రెడీ పులిహోర, పాయసం, రెండు కూరలూ, పప్పూ అన్నీ చేశాను. నువ్వు నాన్ వెజ్ అంటావేమోనని రెస్టారెంట్ అన్నానమ్మా!" తన వంక ప్రేమగా చూస్తూ అన్నది శ్రీమతి.

"మా అమ్మ మంచిది..." అమ్మ ఒళ్ళో తలదాచుకుంది తను. తనను నేనూ ఆప్యాయంగా హత్తుకున్నాను. నా మనసు గతంలోకి పరుగు తీసింది.

★★★

మా పెళ్ళైన ఏడేళ్ళకి మా ఒక్కగానొక్క అమ్మాయి దీప్తి పుట్టింది. తన బర్త్ డే అంటే మా ఇంట్లో ఒక పెళ్ళిలాగే జరిగేది.

మా అమ్మాయి పెద్దయ్యి, పెళ్లి చేసి అత్తవారింటికి పంపినా ఆ పుట్టిన రోజుకి మేమంతా వాళ్ళ ఇంటికి మేము వెళ్ళడం గాని, మా ఇంటికి వాళ్ళు రావడం గాని జరిగేది. ఆ అలవాటును మేం ఇప్పటికీ మార్చుకోలేదు. వాళ్ళ అత్తగారిదీ ఈ ఊరే కావడం వల్ల ఏ ఇబ్బందీ ఉండేది కాదు. ఆ రోజున ఇంట్లో కేక్ కట్ చేసి చుట్టుపక్కల అందర్నీ పిలిచి పార్టీ ఇవ్వడమూ, ఆ తరువాత రెండు కుటుంబాల వాళ్ళమూ కలిసి ఏదైనా రెస్టారెంట్ కి వెళ్లి రావడమూ, ఆ పైన బీచ్, సినిమా ఇలా సరదాగా గడిచిపోయేది.

ఓ రోజు సాయంకాలం నేనూ, ఆవిడా ఇంటి బయటి చిన్నపాటి తోటలో కూర్చుని టీ తాగి పిచ్చాపాటీ మాట్లాడుకుంటూ ఉంటే

"డాడీ!" అంటూ హుషారుగా మా అమ్మాయి గొంతు వినిపించింది.

"అమ్మా! దీప్తీ!" అంటూ నేనూ, ఆవిడా ఎదురు వెళ్ళాము. ఆ వెనుకనే వస్తున్న అల్లుడ్నీ "రండి! రండి! చాలా రోజులకి." అంటూ ఆహ్వానించాం.

అందరూ లాన్ లో కుర్చీల్లో కూర్చున్నాం. టీ త్రాగుతుండగా చెప్పడం మొదలు పెట్టాడు అల్లుడు.

"ఈ సారి మన దీప్తి బర్త్ డే కి కొత్త ప్రపోజల్ చేసింది మావయ్యగారూ!"

"ఏమిటండీ అది?" ఆసక్తిగా అడిగింది మా శ్రీమతి.

"ప్రతీసారీ లాగా మనం కేక్ కట్ చేసి రెస్టారెంట్ కి వెళ్లకుండా ఈ సారి ఎవరైనా బీద సాదలకు ఆ మనీ ఇచ్చేద్దామంటోంది తను." ఆగాడు అల్లుడు.

చాలా సంతోషమనిపించింది. అయితే డబ్బులు అలా ఇచ్చే బదులు ఏదైనా అనాధ శరణాలయంలో ఆ రోజున అందరికీ విందు లాగా చేద్దామని మా ఆవిడ ప్రపోజ్ చేసింది. ఈ ప్రపోజల్ కి నూటికి నోరు శాతం ఓట్లు పడ్డాయి.

ఫలితంగా ఆ సంవత్సరం మేం ఒక అనాథ శరణాలయానికి వెళ్లి అలాగ విందు ఏర్పాటు చేశాం. ఆ పిల్లలందరూ ఎంతో సంతోషించారు. కానీ ఎందుకో ఒక్క పాప మాత్రం చాలా మూడీగా ఉండటం చూసి ఎందుకని అడిగాం.

ఎంతో సేపు అడిగించుకొని, బ్రతిమలాడగా ఆ పదకొండు, పన్నెండేళ్ళు నిండి ఇప్పుడిప్పుడే సొంత ఆలోచనలు వస్తున్న ఆ పాప నోరు విప్పింది. "దేవుడు మా నొసటన దరిద్రమొక్కటే కాదు అంకుల్! ఎప్పుడూ ఎవరో ఒకరి దగ్గర చేయి చాచి తీసుకోవడమే రాశాడు. నేను ఇంకొకరికి ఎప్పటికి ఏమైనా ఇవ్వగలుగుతాను? ఈ జన్మలో అది సాధ్యమా!"

మేము నలుగురమూ అవాక్కైపోయాము. ఆ పాప ప్రశ్న లోని చేదు నిజమూ, మీదు మిక్కిలి అందులో ఉన్న విషాదపు కోణమూ మమ్మల్ని దిగ్భ్రాంతికి గురి చేశాయి. మనసులో ఒక నిర్ణయం చేసుకుని ఆ అమ్మాయి చెయ్యి నా చేతిలోకి తీసుకున్నాను. తనని దగ్గరికి తీసుకున్నాను. కళ్ళల్లోకి చూస్తూ అన్నాను. "పాపా! నీ పేరేమిటో తెలియదు గానీ ఇక నుండి నువ్వు నా బిడ్డవమ్మా! నువ్వు కోరుకున్నట్టే నీది ఎప్పుడూ ఇచ్చే చెయ్యే అవుతుంది గాని పుచ్చుకునే చెయ్యి కాదు. ఓ కే నా!" నా నిర్ణయాన్ని స్వాగతిస్తూ మా అమ్మాయీ అల్లుడూ, మా ఆవిడా అందరూ చప్పట్లు కొట్టారు.

అప్పుడు మా ఊహలకు విరుద్ధంగా, అంచనాలకు వ్యతిరేకంగా ఆ పాప గొంతులోని దుఃఖపు జీరా పోయింది. ఒక ధృఢ నిశ్చయం వినిపించింది.

"వద్దంకుల్. నేను రాను. ఇక్కడ నా తమ్ముళ్ళూ, అన్నయ్యలూ, అక్కలూ, చెల్లెళ్ళూ చాలామంది ఉన్నారు. వాళ్ళందరినీ మీరు తీసుకు వెళ్లగలరా? మేము ఎంత మంది అనాథలం ఉన్నామో అంతకంటే ఎక్కువ మందే ధనవంతులున్నారు. మమ్మల్నందరినీ తీసుకునే వారిగా కాకుండా ఇచ్చేవారిగా మార్చగలరా మీరు?"

మాట రాని వాడిలా అయిపోయాను. ఆ రోజుకి ఆ వేడుకలు ముగించుకొని ఇంటికి వచ్చాము. ఆ పాప ప్రశ్న అలాగే నన్ను వెంటాడుతూ ఉండిపోయింది. తరువాత ఒక రోజు మా కాలనీలో ఒక సమావేశంలా ఏర్పాటు చేసి ఈ సంఘటన గురించి చెప్పాను. మనసున్న వారందరూ కదిలిపోయారు. కానీ ఆ పాప అన్నటుగా అందరినీ అందరూ ఆ అనాథలను మా పిల్లలతో సమానంగా  పెంచుకోగలమా? సాధ్యం కాదుగా! మరేం చెయ్యాలి?

అప్పుడు వచ్చింది ఆలోచన. ఏడాదికి ఒక రోజు ఆ పిల్లల పుట్టిన రోజు నాడు ఒక్కొక్కరూ ఒక్కక్కరిని తీసుకువచ్చి ఆ రోజంతా వారిని చూసుకునే ఆలోచన. వెంటనే మేము కొంతమందిమి వెళ్ళాము. ఆ ఆశ్రమంలో ఉన్న పిల్లల పుట్టిన రోజును మా పిల్లల పుట్టిన రోజులాగే జరపదలిచామనీ, వాళ్ళ పుట్టిన రోజులు తెలియచేస్తే ఆయా రోజులలో ఆ పిల్లలను మా ఇళ్లకు తీసుకుని వెళతామనీ ఆశ్రమ నిర్వాహకులను అడిగాము.

దాదాపు తలంతా నెరిసిపోయి ఎనభై వయసుకు దగ్గరపడుతున్న ఆయన  నవ్వారు. ఆ తరువాత కళ్ళను తుడుచుకుంటూ అన్నారు."సర్! ఏమీ అనుకోకండి. మీ ఆలోచన బాగుంది. కానీ తల్లిదండ్రులూ,ఇళ్ళూ, పుట్టిన రోజులూ తెలిస్తే వాళ్ళు అనాథలెందుకవుతారండీ!" మేము మరోసారి నిశ్చేష్టులయ్యాము.

మళ్ళీ ఆయనే అన్నారు "మరోలా అనుకోకండి సార్! ఉన్న విషయం చెప్పాను. కానీ మీ ఆలోచన చాలా అద్భుతం. తప్పకుండా అలాగే చెయ్యండి. అయితే ఒక పని చెయ్యండి. మా పిల్లలు ఈ శరణాలయానికి వచ్చిన రోజునే వాళ్ళ పుట్టిన రోజుగా మీరు ప్రతి సంవత్సరం తీసుకు వెళ్ళండి." అన్నారాయన. మేం సంతోషంతో తల ఊపాం. అప్పటినుండీ మేమంతా ఆ కార్యక్రమం అలాగే అమలు జరుపుతున్నాం. ముందుగా  శ్రీలక్ష్మిని మేమూ, మరికొంతమంది మావాళ్ళూ కొంతమంది పిల్లల్ని అచ్చంగా తీసుకువచ్చేశాం. అప్పట్నుంచీ ఆ పాప మా దగ్గరే పెరుగుతోంది. ప్రతీ ఏటా మా దీప్తి పుట్టిన రోజులాగానే  శ్రీలక్ష్మిది కూడా పుట్టిన రోజు జరుపుతున్నాం.

"డాడీ!మీరెక్కడికో ఆలోచనల్లోకి వెళ్ళిపోయారు! అందరూ తయారయ్యారు. మీరూ తయారవ్వండి బీచ్ కి." నా ఆలోచనలు పసిగట్టిన పెద్దమ్మాయి దీప్తి హెచ్చరించింది. నేనూ లేచాను. నేను బీచ్ కి రెడీ అవ్వడానికి డ్రెస్ మార్చుకుంటూ ఉంటే శ్రీలక్ష్మిని తీసుకు వచ్చిన రోజున ఆ శరణాలయం లోని పెద్దాయన అన్న మాటలు అనుకోకుండా గుర్తొచ్చాయి.

"ఈ రోజు ఇంతమంది మనసుల్లో ఇంతమంచి ఆలోచన రావడం మామూలు విషయం కాదండి. ఇది మీ మనసుల్లో దేవుడు పుట్టిన రోజు సార్."

***

COMMENTS